

రేవనూరు శమంత

ఆ దినం శోభాదేవి జీవితంలో ఒక సుదినం. అంతేకాదు, అది మొదటి సుదినం. అటువంటి దినం ఇదివరకు రాలేదు. వస్తుందనే కాంక్ష వదులుకొని నిరాశతో గుండె నిబ్బరం చేసుకొన్నది. జీవయాత్ర నిర్విఘ్నంగా యంత్రాధారంగా నడిచే వాహనంరీతిగా సాగిపోతూ ఉంది ఇదివరకు. పగలు వెనక రాత్రి, రాత్రి వెనక పగలు, దినం వెంట దినం, మాసం తరవాత మాసం,

అదీ నా బ్రతుకు. చంద్రా, నీవు నాకొక దేవతామూర్తివి. భక్తురాలిని త్యజిస్తే ఏం చెయ్యగలదు, విలపించటం తప్ప?"

వెక్కివెక్కి ఏడుస్తున్న శోభను ఓదార్చడానికి ప్రయత్నించాడు చంద్రా. "వద్దు, శోభా, ఏడవవద్దు. నీ కన్నీరు నన్ను దహించి వేస్తూ ఉంది. నేను దేవతగా నీవు ఆరాధించడానికి తగినవాణ్ణి కాను. అయితే నీవుమాత్రం దేవిస్వరూపిణివే."

"ఎందుకలా అంటారు? నేను బాధపడుతున్నాను గాని మిమ్మల్ని బాధించడంలేదు. ఈ లోకాన్ని ఎంత త్వరగా వదిలిపోతే అంత భాగ్యవతిని."

"ఏమి, శోభా, ఇంత నిరాశ! అబ్బా, ఎంత బాధ పెట్టాను! పాపిని!"

"మీపైన ద్వేషం లేదు నాకు. నేను ప్రేమించిన పురుషుడు మీ రొక్కరే. మీకే నా జీవితం, నా కళ అంతా అంకితంచేసి తరిస్తాననుకొన్నాను. మీరు మీ ప్రేమలో ఈ శోభను శోభాయమానంగా చేస్తారని నమ్మాను."

"ఆహా, ఎంత పుణ్యవంతుణ్ణి! ఏమి, శోభా, ఇప్పుడు మాత్రం ఏమైంది? నిజమే, నేను తప్పు చేశాను. దానిని తప్పు దండంతో సరికదా. ఏదీ, జరిగింది మరిచిపో. నాట్యంచెయ్యి ఏకాంతంగా నా కోసరం. జయదేవుని ఎదుట పద్మావతి నాట్యంచేసినట్లు నాట్యం చెయ్యి. అష్టపది ఒకటి పాడతాను."

శోభాదేవి చెరగుతో కండ్లు తుడుచుకొని, "స్వామీ, ఆంతకన్నానా!" అని నాట్యానికి గజ్జె కట్టుకొని సిద్ధమైంది. చంద్రా పాడుతూంటే అసమాన చాతుర్యంతో నాట్యంచేసింది. పరవశ అయి చంద్రా కాళ్లమీద పడిపోయింది! చంద్రా లేవనెత్తి తన పక్కన కూర్చోబెట్టుకుని చెదిరిన ముంగురులు చక్క జేసి, నుదుటిమీది చిరుచెమ్మట తన ఉత్తరీయంతో ఒత్తి, "నా శోభా! నీ లావణ్యానికి మురిసిపోవాలో, నీ నాట్యాన్ని మెచ్చుకోవాలో తెలియకున్నాను. నా పిచ్చిశోభా! ఎంత నవనీతసమానం నీ హృదయం! నేను నీ దాసుణ్ణి!"

"కాదు...మీరు నా భర్త, ప్రాణేశ్వరులు."

చంద్రా, శోభాదేవిని చేరదీసి గాఢాలింగనంతో లీనం చేసుకొన్నాడు.

• • •

రోజులు, వారాలు గడిచిపోయినాయి ఆనంద ప్రవాహంలా. చంద్రా, శోభాదేవితోనే ఉండిపోయాడు. ఎప్పుడైనా పనిమీద వెళ్లినా సాయంత్రానికి వచ్చేవాడు. శోభాదేవికూడా నాట్యప్రదర్శనం మానుకుంది. తన నాట్యం తన మనోనాథుడైన చంద్రాకే. చంద్రా ఆమెకు ప్రత్యక్షదైవం. దేవుని కర్పించిన తన కళ మానవమాత్రులకు ఇవ్వడం పాపకార్యం. అసాధ్యం. అందులో తన చంద్రా సామాన్యుడు కాడు. సంగీత సాహిత్యకోవిదుడు. నాట్యశాస్త్రపారంగతుడు. తన కోసరం గీతాలు వ్రాసేవాడు. ఆ గీతాలు పాడుతూంటే శోభ అభినయిస్తూ నాట్యంచేసేది. ఈ విధంగా రోజులు క్షణాలుగా అనుభవిస్తున్నా ఆ మొదటి రాత్రి స్మృతి హృదయాంతర్భాగంలో శాశ్వతంగా నిలిచిపోయింది శోభాదేవికి.

చంద్రా ఒంటరిగా ఉన్నప్పుడు ఆలోచనా నిమగ్నుడై ఉండేవాడు. ఏదో ఆవేదన ముఖంలో విదితమయ్యేది. కనుబొమలు ముడిపడేవి. నిట్టూర్చే వాడు. ఏమీ తోచక గదిలో పచారుచేసేవాడు. శోభ వచ్చే చప్పుడు వినగానే మారిపోయి మందహాసంతో ఎదుర్కొనేవాడు.

శోభ ప్రశాంతంగా గాఢనిద్ర పోతున్నప్పుడు చంద్రా మేల్కొని తనలో తాను చర్చించుకునేవాడు. శోభప్రేమ నిష్కళంకమైనది. తనప్రేమ అట్టి దేనా? శోభను మోసం చేస్తున్నానా? అనే ప్రశ్నకు సరియైన సమాధానం రాలేదు. భవిష్యత్తు సందేహ పూరితమైంది. అటువంటి సమయాల్లో శోభకు మెలకువ వచ్చినప్పుడు ఎంతో ఆదరంతో, "ఏమండీ, నిద్ర రాలేదా?" అని అడిగేది. "అబ్బే, ఇప్పుడే మెలకువైంది. మంచినీళ్లు తాగి పడుకొంటాను" అంటే తానే తీసుకొనివచ్చి ఇచ్చేది. తాగి కళ్లు మూసుకొనేవాడు.

ఒకరాత్రి అటువంటి సమయంలో చంద్రా అన్నాడు: "శోభా, నేను నీకు తగినవాణ్ణి కానేమో అన్న సంశయం బాధిస్తూంది." శోభకు కోపం వచ్చింది. "అలా అంటే నేను నేలపై పడుకొంటాను, చాప, తలగడ లేకుండా" అని లేచింది. చంద్రా చెయ్యి పట్టుకొని తన పక్కమీదికి శోభను లాక్కొని బుజ్జగించాడు.

ప్రతిదినము శోభ స్నానంచేసి పూజాగృహంలో శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించేది, చంద్రాకు ఆయురారోగ్యసౌభాగ్యాలు ప్రసాదించమని. తనకై ఏమీ కోరుకునేదికాదు. తుదకు చంద్రాకు తన మీద ప్రేమ తగ్గకూడదనిసహా.

ఆనాడు శోభ మనసు ఎందుకో తెలియని ఆవేదనతో నిండిపోయింది. సాయంత్రం చంద్రా బైటికి వెళ్లాడు. ఎక్కడికో తెలియదు. సాధారణంగా అతను చెప్పడు, ఆమె అడగదు. కొంతకాలం విడిచి వెళ్లినా ఏదో మోస్తరుగా ఉంటుంది శోభకు. ఎప్పుడో ఒకనాడు అలాగే వెళ్లిపోయి మళ్లీ తనదగ్గరికి రాడేమో అనే భావం హృదయాన్ని బరువుచేసేది. అది అసంభవమని తనకు తానే ధైర్యం తెచ్చుకొనేది.

ఆనాడు రాత్రి ఎనిమిది గంటలైనా చంద్రా రాకుంటే ఆ ధైర్యం క్షీణించింది. తొమ్మిది గంటలకు పూర్తిగా నశించింది. గడియారం పదిగంటలు కొడుతూఉంటే ఆ గంటలు తన గుండెలో కొట్టుతున్నట్లు తోచింది. దడ పుట్టింది. నెత్తురు తలకెక్కింది. ఒళ్లు వేడైంది. ఏదో ఆపద సంభవిస్తుందనే నమ్మకం ఆవరించింది. నిమిష నిమిషానికి ఆందోళన హెచ్చు కాజొచ్చింది. చిటుక్కుని శబ్దమైతే ఉలికిపడేది!

అఖరికి తలుపు తట్టిన చప్పుడు విన్నది. భీతితో వెళ్లి తలుపు తీసింది. కనబడిన దృశ్యం బీభత్సంగా ఉంది. ఇద్దరు యువకులు చంద్రాను పట్టుకున్నారు. అతనికి స్పృహ ఉన్నట్లు లేదు. నుదుటిమీద గాయం తగిలినట్లుంది. జుబ్బా రక్తసిక్తంగా ఉంది. ఇద్దరిలో ఒకడు, "ఏమండీ, శోభాదేవిగారి ఇల్లిదేనా?" అని అడిగాడు.

"అవును. నేనే శోభాదేవిని. చంద్రాకు ఏమైంది?" ఈ మాటలు యంత్రంనించి వచ్చినట్లున్నాయి.

"ఏమీ ప్రమాదం లేదు. సరిగ్గా మేమే ఇక్కడికి చేరుస్తాం. కొంతకాలానికి సరిపోతుంది. చంద్రా కొంచెం ఎక్కువగా పుచ్చుకున్నాడు. తెలివి తప్పుతూ ఉన్నప్పుడు తమ నివాసం చెప్పి ఇక్కడికి తీసుకొని వెళ్లమన్నాడు."

ఎలాగో చంద్రాని మంచంమీద పడుకోబెట్టి మిత్రులు వెళ్లిపోయారు. అప్పటినించి శోభ చంద్రాకు ఉపచారం చెయ్యడంతో సరిపోయింది. గాయాన్ని శుభ్రంచేసి మందు రాసి జుబ్బా మార్చింది. ఆ రాత్రి శోభ ఒక్క ఘడియైనా నిద్రపోలేదు. గుండె రాయైపోయి ఒక్క కన్నీటిబొట్టయినా రాలేదు.

తూర్పు తెలతెలవారుతున్నవేళకు చంద్రా కళ్లు తెరిచాడు. "శోభ... నా శోభ ఎక్కడ?..." అని హీనస్వరంతో అడిగాడు. శోభ దుఃఖాన్ని అపుకొని, "ఇక్కడే ఉన్నాను. చంద్రా, లేచి ముఖం కడుక్కోగలరా? ఇక్కడికే నీళ్లు తేనా?" అని అడిగింది.



అంతర్ముఖుడు
చిత్రం జి. ఎల్. నరసింహారావ్ (బెంగుళూరు-3)

చంద్రా తానే లేచి అవసరాలు తీర్చుకున్నాడు. శోభ కాఫీ ఇచ్చింది. తలనొప్పిగా ఉంటే మందు ఇచ్చింది. క్రమేపి చంద్రా మనుష్యుల్లో పడ్డాడు. రాత్రి ఉదంతం గురించి శోభ ఒక్క మాటైనా అనలేదు. చంద్రామాత్రం ఒక్కసారి అన్నాడు: "శోభా, ఇక మీద ఇలా ఎన్నడూ జరగదు. ప్రమాణం చేస్తున్నా." శోభ పలకలేదు.

మరునాడు భోజనానంతరం శోభ చుట్టి ఇచ్చిన తాంబూలం సేవిస్తూ చంద్రా ఉల్లాసంగా ఉన్నప్పుడు కొంత జంకుతో, కొంత చనువుతో శోభ ప్రశ్నించింది:

"ఏమండీ... నే నొకటి అడుగుతాను. ఇష్టముంటే చెప్పండి. కోపంమాత్రం చేసుకోకండి."

"శోభా, నీపైన కోపమా? భక్తునికి దేవిపైన ఆగ్రహమా!"

"మీరు విజ్ఞానవిదులు, కళాకోవిదులు, కవులు, గుణవంతులు, మంచిచెడ్డా తెలిసినవారు. మీవంటి

వారికి ఈ మధుపాన వ్యసనం ఎందుకండీ?''

చంద్రా కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. తరవాత ఏదో బాధతో చెప్పసాగాడు: ''శోభా! లోకుల అభిప్రాయంలో మధుపానం ఒక వ్యసనం. అసహ్యమైంది, అనాచారమైంది. ఆరోగ్యాన్ని చెడగొడుతుందని, బుద్ధి మందగిస్తుందని, విచక్షణ జ్ఞానం నశిస్తుందని నిందిస్తారు. నిజమే. కాని మనుష్యులు ఎందుకు తాగుతారు అని విచారించరు. మధుసేవలో ఉండే గొప్పగుణం ఏమంటే తత్కాలానికైనా అన్నీ మరిపించే శక్తి కలుగుతుంది. ప్రతి మనిషికి తన్ను తాను మరిచిపోవాలనే కోరిక ఉంటుంది. ఆ కోర్కెను ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా తీర్చుకోవడానికి ప్రయత్నిస్తారు — కొందరు ప్రేమలో, కొందరు ధనార్జనలో, కొందరు కళలో, కొందరు భగవదారాధనలో. ఈ మార్గాలు అందరికీ సుగమం కావు. మధుపానం సులభమైన మార్గం. కష్టాలు, బాధలు, నిరాశలు, క్లిష్ట సమస్యలు అన్నింటినీ మరిపించగలదు మద్యపానం.''

''నే నడిగింది మిమ్మల్ని గురించి?''

''నాకూ అదే కారణం. మరిచిపోవడానికి.''

''అటువంటిపరిస్థితులు మీకెందుకు ఉంటవండీ?''

చంద్రా వికటంగా నవ్వాడు.

''శోభా, లైబ్రరీకి వెళ్ళివస్తాను. అభినయశాస్త్రం గురించి ఒక అపూర్వ గ్రంథం దొరికిందట. చూచి వస్తాను'' అని ఉత్తరీయం వేసుకొని వెళ్ళిపోయాడు.


* * *

తన ప్రశ్నకు జవాబివ్వకుండా తటాలున చంద్రా వెళ్ళిపోవడంతో శోభ మనస్సు నిశ్చలమైన తటాకంలో పెద్ద బండ వేసినట్లు అల్లకల్లోలమైపోయింది. చంద్రా మాటలకు అర్థం స్ఫురించలేదు. చంద్రా జీవితం గురించి తనకేమి తెలియదు. మరిచిపోవలసిన విషమ సంఘర్షణ లేమి ఉన్నవో కదా! చంద్రా ఏదో ప్రమాదమైన రహస్యం దాస్తున్నాడు. ఎందుకు తనమీద నమ్మకం లేకనా? మొత్తానికి చంద్రా దుస్థితికి కారణం తానే. ఏ విధంగానో తెలియదు. బహుశా నా ఇంట్లోనే ఉండిపోవడం ఎవరైనా ఆక్షేపించారేమో. ఇవన్నీ కాదేమో? ఏమైనా డబ్బుఇబ్బందుల్లో చికాకుపడుతున్నాడేమో. ఉండదు. శాస్త్రి అంత స్పష్టంగా చెప్పాడే, అగర్భశ్రీమంతుడు. లక్ష్మీపుత్రుడని! ఎంత ఆలోచించినా సమస్య తెగలేదు.

ఆరాత్రి ఏవో మాటలతోనే గడిచిపోయింది. సూటిగా ప్రశ్నించడానికి శోభకు ధైర్యం చాల్లేదు. కాని సందిగ్ధావస్థ అలాగే నిలిచిపోయింది. ఈ సందర్భంలో చంద్రా రాత్రిళ్ళ నిద్రపోకుండా ఉండడం జ్ఞాపకం వచ్చింది. పగలుసహా అనేకసార్లు చంద్రా పరధ్యానంగా ఉండడం గమనించింది. ఏమి చెయ్యడానికి తోచలేదు. ఎప్పుడో ఒకప్పుడు తెలియక పోదనే తీర్మానానికి వచ్చింది.

ఆనాడు శోభ పుట్టినదినం. చంద్రా అత్యంత ఉల్లాసంతో శోభను చేరదీసి దీవించాడు. శోభ అతని పాదాలు తాకి నమస్కరించింది. విందు గుడిచిన వెనక ఇద్దరు కూర్చుని విడెము సేయుచున్నప్పుడు చంద్రా లేచి తన చేతిపెట్టెనుంచి ఒక చిన్న వ్రాతపుస్తకం తీసి శోభాదేవిని సమీపించి, ''శోభా, ఇదిగో నీ పుట్టినదినానికి నా కానుక'' అని ప్రేమతో అందిచ్చాడు. తీసుకొని చూచింది. గేయాల సంపుటం. తొందర తొందరగా ఒకటి వెనక ఒకటి తనలో తాను చదువుకొని, ''ప్రభూ, ఎటువంటి కానుక! ఒక్కొక్క గేయం ఒక మంచి ముత్యం. ఎప్పుడు వ్రాశారండీ? ఏమి భావాలు, ఏమి పదాలు! ఇటువంటి అమూల్యమైన కానుక ఎందరికి లభిస్తుంది? ఏదీ, మొదటి గేయం మీరే చదవండి.'' అని వేడుకొంది. చంద్రా రాగయుక్తంగా చదివాడు.

''నీ వొక రాణివి నేనొక కవిని
నీకేమి కానుకలు నేనియ్యగలను?
బంగారు నగలను నేనియ్యలేను
శృంగార రసముతో
పొంగారు గీతములు
ప్రేమతో అర్పించగలను.
విలువైన చీరలు నేనివ్వలేను



రహదారి వాహనాలు

ఫోటో—ఎస్. షా అలీ (హైదరాబాద్)

వెలలేని కోర్కెల జలతారుతోఅల్లి
మృదువైన కలలియ్యగలను.
ఇచ్చిన నా కానుకలు
మెచ్చితే ఒకసారి
చిరునవ్వు నవ్వితే చాలు!''

ఆహా! ఎంత భాగ్యవతిని నేను!'' అని పరవశఅయి శోభ కళ్ళు మూసుకొంది.

''అట్లాగే కళ్ళు మూసుకొని ఉండు. నేను చెప్పే వరకు తెరవవద్దు.'' అని చంద్రా తన పెట్టెలోనించి మంచి ముత్యాలహారాన్ని శోభ మెడకుపెట్టి ... ''ఇప్పుడు చూడు అద్దంలో ఎంత రమణీయంగా ఉన్నావో!'' అన్నాడు.

''అమ్మయ్యో. ఎంత సొగసైన హారం! ఎంత విలవైందో. నా కోసం ఎందుకింత ఖర్చుపెట్టారు. మీరు వ్రాసిన గీతమే నా మనోభావాన్ని చక్కగా చిత్రించింది'' అని కోకిలకంఠంతో ఈ గీతాన్ని పాడింది.

లు వద్దు,
చీరలు వద్దు,
సిరిసంపదలు వద్దు
మీరుంటే చాలును నాకు!
మేలు కలిగినా
కీడు వచ్చినా
ఎవరేమన్నాగాని
మీతోనే నా బ్రతుకు!''

చంద్రా శోభను గాఢంగా కౌగలించుకొన్నాడు.

* * *

''ఏమండీ . . ఈనాడు నాదొక మనవి. మన్నిస్తారా! . . . సాయంత్రం వినాయకుని గుడిలో అర్చన చేయించ వలెనని అనుకున్నాను. మీరు నాతో రావాలి.''

''నేనెందుకు శోభా, నీవు తప్పక వెళ్ళు.''

''తమతో వెళ్ళాలని నా కోరిక పాటించరా?''

''ఎందుకులే. నేనెప్పుడూ గుళ్ళకు వెళ్ళలేదు.''

''అంటే? అభ్యంతరమా? . . లేక మీరు నాస్తికులా?''

''అంతవరకు రాలేదు . . ఎందుకో రావాలనిలేదు.''

''నాకు తెలుసును. మర్యాదస్తులు నాబోటిదానితో రావడానికి పరువు తక్కువ . . . పోనీలెండి. నేను వెళ్తను. నా దేవుడిక్కడే ఉన్నాడు. ఆ దేవునికే అర్చన చేస్తాను.''

''ఎంత పొరబడ్డావు శోభా, నీవు కోరినట్లే చేస్తాను.''

టాక్సీలో దేవాలయానికి వెళ్ళారు, దారిలో పూజా ద్రవ్యాలు కొనుక్కొని. గుడిని సమీపించినప్పుడు ఒక పెద్ద కారులో ఇద్దరు స్త్రీలు గుడినుండి వెళ్ళడం చూచాడు చంద్రా. చూచి తక్షణం తల తిప్పేశాడు. ఇది శోభ గమనించింది కాని కారణం అర్థం కాలేదు.

అర్చన ముగిసిన వెనక వచ్చిన టాక్సీలోనే ఇంటికి వెళ్ళారు. దారిలోగాని ఇంట్లోగాని చంద్రా ఒక్క పలుకాడలేదు. మౌనంగా పరధ్యానంగా ఉండిపోయాడు. 'అయ్యో, ఆయన కిష్టంలేని కార్యం చేయించాను కదా!'



## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన విలునామాన్నూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోపూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, విదేశ ప్రయాణము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, విధివిశేషములు, లాటరీ, అకస్మాత్ ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1–25 పైగా మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహాము లేమైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంప బడును. మేము పంపిన జోస్యము మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**

నిమిషాలమీద వండండి
అపాయంలేని

## ప్రెస్టీజ్

ప్రెషర్ కుక్కర్‌మీద

* నిరపాయకర విధానములు దీనిని ఎంతో నిర్భయంగాను సౌలభ్యముగాను 12 సంవత్సరముల పిల్లకూడా ఉపయోగించే టట్లు చేస్తాయి.
* బొగ్గు, నూనె వంటచెరకు తగ్గించుకోండి. పెట్టుబడికయే ఖర్చు వంటకు పట్టే కాలము 5 వ వంతు మాత్రమే.
* ప్రతి కుటుంబానికి సరిపోయే సైజులు ఉన్నాయి.




తయారుచేయువారు :
టిటికె. (ప్రైవేట్) లిమిటెడ్, బెంగళూరు-16

TTP-3998

దిగువ చోట్ల లభించును :

1. మెస్సర్స్. మహమ్మద్ ఇబ్రహీం అండ్ కం. ప్రై. లిమిటెడ్ అబిద్‌రోడ్డు, హైదరాబాద్
2. మెస్సర్స్. ప్రిన్స్ స్టోర్స్ . . . అబిద్‌రోడ్డు, హైదరాబాద్
3. మెస్సర్స్. నవరత్న స్టోర్స్ . . . బ్యాంక్‌వీధి, హైదరాబాద్
4. మెస్సర్స్. నవరత్నస్టోర్స్ . . . సుల్తాన్‌బజార్, హైదరాబాద్
5. మెస్సర్స్. రాఘు అండ్ కం., . . . నారాయణగుడ, హైదరాబాద్
6. మెస్సర్స్. మాలిక్ ఎంటర్‌ప్రైజెస్ . . . లక్‌డీకా పూల్, హైదరాబాద్
7. మెస్సర్స్. మహమ్మద్ షాబుద్దీన్ అండ్ బ్రదర్స్ . . . ఎం.జి. రోడ్డు, సికింద్రాబాద్
8. మెస్సర్స్. అముల్ స్టోర్స్ . . . ఎం.జి. రోడ్డు, సికింద్రాబాద్
9. మెస్సర్స్. నేషనల్ ఎంటర్‌ప్రైజెస్ . . . రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాద్


అని శోభ కూడా బాధపడుతూ మౌనంగా ఉంది. ఇద్దరి మధ్యా ఒక తెర కట్టేసినట్లయింది.

ఆరాత్రి చంద్రా ఎంతో ఆప్యాయంగా "శోభా, నా పక్కన కూర్చుని ఏదైనా భక్తిరసవంతమైన గీతం పాడు" అని కోరాడు. శోభ ఎంతో ఆనందంతో పాడింది, అరమోడ్చిన కన్నుగవతో . . . .

"అన్ని ధర్మములు విడనాడితిని,
నిన్నే శరణంటిని.
వేద శాస్త్రములు పఠించలేదు,
యోగాభ్యాసము లేదు,
జపములు తపములు చేయజాలను!
మంత్ర తంత్రములు రావు,
ఎన్ని పాపములు చేసినానో,
నాకే తెలియదు!
నీట ముంచినా పాలముంచినా
నీవే గతినాకు!"

పాట ముగించి శోభ చంద్రా పాదములంటి నమస్కరించింది.

శోభ ఎంత విచిత్రమైన వ్యక్తి! శృంగార రసములో తొణికిసలాడుతూ ఉండగలదు. భక్తి రసములలో మైమరవగలదు. చిట్టచివరకేమైపోతుందో కదా అని పరిపరివిధాల తలపోయజొచ్చాడు చంద్రా.

"ఏమండీ అలా ఉన్నారు?"

జవాబులేదు.

"మిమ్మల్నేనండీ. పలకరేందుకు? నా మాటలు వినలేదా? గుడికి వెళ్లిరాగానే సర్వం మరిచినట్లున్నారే! భక్తి ముదిరిందా?"

"అవును. నీమీద భక్తి. నిన్ను చూస్తూఉంటే అన్నీ మరిచిపోతున్నాను."

"నిజంగానా? చమత్కారమా? అతిశయోక్తా?"

"రెండూ కాదు. యథార్థం. నిన్ను చూస్తూఉంటే లోకమే మరిచిపోతున్నాను. నిజంగా."

"అయితే నాజన్మ తరించింది! నా దేవునికి నాపై ఇంత కరుణకలిగితే ధన్యురాల్ని."

"శోభా, శోభా, నన్నెప్పుడైనా మరిచిపోతావా?"

"ఏమి మాటలండి! నాకది అసాధ్యం. నా ప్రతి రక్తనాళంలో, ప్రతి అణువులో మీరున్నారు!"

"నిజంగా శోభా?"

"అయ్యో, సందేహం వచ్చిందా?"

"కాదు శోభా, నన్ను ఎప్పుడైనా వదిలి వెళ్ళిపోవు కదూ?"

"ఏమి ప్రశ్న! నేనెక్కడికి వెళ్లగలనండీ! ఏదో నామీద అపోహ. అందుకే ఇలాంటి మాటలు."

"కాదు, శోభా, కాదు. నాకే అనుమానంలేదు. సత్యంగా . . . ఏమో. ఒకవేళ వెళ్లిపోతావేమో అని భయం."

"ఎంత పిచ్చివారండీ! ఇంతేనా నామీద నమ్మకం?"

"కాదు . . . భయానికి అర్థంలేదు! అమూల్యమైన మణి దగ్గిరఉంటే జారిపోతుందేమో అనే అకారణమైన భీతి. క్షమించు శోభా, అనవసరంగా నిన్ను బాధ పెట్టాను. ఇంకెప్పుడూ ఇలాటి మాటలనను."

అంతటితో సంభాషణ ముగిసినా శోభ మనస్సుకు శాంతి కలుగలేదు.

(సశేషం)

# ముక్తి

రేవనూరు శమంత

(క్రిందటి సంచిక తరువాయి)

శోభ ఒంటరిగా కూర్చుని చంద్రా వ్రాసిన గీతాలు మెల్లిగా పాడుకుంటూ ఉంది. అంతలో తలుపు తట్టిన శబ్దం విన్నది. చంద్రా అప్పుడే బైటికి వెళ్లాడు కనక అతనై ఉండడు. చంద్రా అయితే తానే వెళ్లి తలుపుతీసేది. ఇప్పుడు పనిమనిషి తీసింది. పైకి వచ్చి, "అమ్మా తమకోసం ఎవరో వచ్చార"ని చెప్పింది.

"నా కోసరమా. ఎవరు?"

"ఎవరోనమ్మా. ఆడమనిషి."

శోభ దిగివెళ్లింది. ఒక గొప్ప ఇంటి స్త్రీ అయి ఉండాలి. చూస్తే, తనకన్నా కొంచెం పెద్దది.

"తమరేనా శోభాదేవిగారు?"

"అవును."

"నమస్కారం."

"నమస్కారం. తమరెవరో తెలియదు."

"నాపేరు కమల. నన్ను మీరెరగరుగాని మీగురించి నాకు తెలుసును."

"అవును. నర్తకిని కదా."

"ఆ కారణంచేత కాదు."

"కూర్చోండి. కాఫీ తెచ్చిఇస్తాను, తరవాత మాట్లాడుకోవచ్చును."

"ఎందుకులెండి."

"అలాకాదు. కొంచెం పుచ్చుకోండి" అని లోపలికి వెళ్లి కప్పులో కాఫీ తెచ్చి ఇచ్చింది.

కమల ఆశ్చర్యానికి మేరలేదు. ఎంత వినయం, ఎంత మర్యాద! శోభాదేవి ఇలా ఉంటుందనుకోలేదు. తుదకు ఎందుకు వచ్చానని సహా అడగలేదు.

"శోభాదేవిగారూ, నేనెందుకు వచ్చానో మీకు అగమ్యగోచరంగా ఉంటుంది. క్షమించండి. ఒకమాట . . . వారున్నారా?"

"ఎవరు?"

కమల తలవంచుకొని . . . "వారేనండి." అన్నది.

శోభాదేవికి ఏమీ తోచలేదు.

"వారుంటే ఒక్కసారి చూచి వెళతాను."

శోభకు తటాలున స్ఫురించింది, చంద్రా కోసరమే ఆవిడ వచ్చిందని.

"చంద్రశేఖరంగారా?"

"అవును."

"వారిప్పుడే బైటికి వెళ్లారు. ఎప్పుడు వస్తారో చెప్పలేను."

శోభకు సందేహాలు చుట్టుముట్టినాయి. ఈమె చంద్రా ప్రియురాలేమో, తనకు ముందు! తనతో పరిచయమైన వెనక మారిపోయాడేమో!

"వస్తే చెబుతాను, వారు మీకు బంధువులా? స్నేహితులా?"

కమల లేచి మెల్లిగా చెప్పింది, "వారు నా భర్త."

శోభకు తనపైన పిడుగుబడినట్లయింది! నోట మాట రాలేదు! గుండె వడివడిగా కొట్టుకొంటూ ఉంది. తల తిరిగిపోతూ ఉంది. కళ్లు మబ్బుగమ్మినట్లయినాయి!

శోభ స్థితిచూచి కమల ఆదుర్దాపడింది. జాలి పడింది.

"శోభాదేవీ . . శోభాదేవీ . . ."

శోభ కమలను వెర్రిగా చూస్తూ నిలబడింది. పలుక లేదు.

కమల హృదయం అతి విచలితమైంది. ఇంకొక స్త్రీ బాధపడుతూ ఉంటే సహించలేకపోయింది. శోభాదేవి తన భర్త ప్రేమించిన యువతి అని అసూయ చెందలేదు.

"అయ్యో, ఇంత నొప్పిస్తానని ఊహించలేదు. క్షమించండి!" అని శోభను దగ్గరగా తీసుకుంది.

శోభ తెప్పరిల్లింది. "నేనా క్షమించేదాన్ని?" అని గద్గద స్వరంతో అంది.

"ఒక్కసారి వారిని చూచి వెళదామని వచ్చాను. అంతే. అంతకన్నా నాకే కోరికాలేదు."

"అలాగే, తప్పకుండా."

"మీరెంత మంచివారండీ! మిమ్మల్ని అనవసరంగా బాధించాను!"

"నాకే బాధలేదు. మిమ్మల్ని చూస్తూ ఉంటే మా అక్క జ్ఞప్తికి వచ్చింది. మీలాగే ఉండేది. మీలాగే మాట్లాడేది. అదే వినయం. అదే శాంతం. అక్కయ్య బ్రతికి వచ్చినట్లు తోచి భ్రమించాను."

"ఆశ్చర్యం. నన్నువదిలిపోయిన చెల్లికూడా మీలాగే ఉండేది. ఆ చూపులే! ఆ కంఠ స్వరమే!"

ఇద్దరి మనసులు ఆర్ద్రభావంతో కలిసిపోయినాయి. చిరకాలమైత్రి ఉన్నట్లు చేతులు పట్టుకున్నారు.

"వారెప్పుడు వస్తారో! నేను సెలవు తీసుకుంటాను. మళ్లీ వస్తాను."

"మీ రాకకు ఎదురు చూస్తూ ఉంటాను."

ఇద్దరి కళ్లు చెమ్మగిల్లినాయి. శోభను వదలలేక భారమైన హృదయంతో కమల వెళ్లిపోయింది.

రాత్రి ఎనిమిది గంటలు దాటినా శోభ చీకట్లో కూర్చుని కన్నీరు కారుస్తూ కమలను గురించే తలపోస్తూ ఉండిపోయింది. చంద్రా వచ్చింది గ్రహించలేదు.

"శోభా, ఏమిది?"

"ఆఁ . . ., ఆఁ. . . వచ్చారా? ఎప్పుడు?"

"ఇప్పుడే. దీపమైనా వెలిగించక ఈ చీకట్లో ఏం చేస్తున్నావు?"

"ఆఁ, నేనా . . . చీకట్లో వెలుతురు చూస్తున్నాను."

"ఏమిటి శోభా, చిత్రంగా మాట్లాడుతున్నావు?"

"అబ్బే, ఏమీలేదు." అంటూ దీపం స్విచ్‌వేసింది.

"ఎందుకలా ఉన్నావు శోభా? సంతోషంగా లేవే!"

"ఆలోచిస్తున్నాను."

"దేన్ని గురించి? మనలను గురించా?"

"కాదు. ఒక దురదృష్టవంతురాలిని గురించి."

"ఎవరామె? చెప్పు శోభా . . కావలిస్తే చేతనైన సహాయం చేస్తాం."

"మీకు తెలిసినవారే."

"ఏమిటి శోభా? ఎవర్నిగురించి ఈ మాటలు? వింతగా ఉందే!"

"ఎవరా? నెలల పర్యంతం ఒంటరిగా బాధపడుతూ జీవయాత్ర సాగిస్తున్న అభాగిని!"

"శోభా, కథ ఏదైనా వ్రాస్తున్నావా? అందులో పాత్రను గురించి మాట్లాడుతున్నావా?"

"కాదు. కథలోని పాత్రకాదు. జీవంలో ఉన్న

పతివ్రతాశిరోమణి. భర్త కోసరం అల్లాడిపోతున్న దీనురాలు!"

"చెప్పు శోభా. ఈ విషమపరిస్థితులో ఎంతకాలం ఉండను?"

"ఏమండీ. మీరు నిజంగా ఊహించలేదా? . . . మీరెంత కఠిన హృదయులండీ! ఒక స్త్రీని, సుశీలను దిక్కుమాలినదాన్ని చేయడానికి మీ మనసు ఎలా ఒప్పింది? కరుణలేదా మీకు?"

"ఎవర్ని ఏంచేశాను?"

"అబ్బా, అంత తెలియలేదా? లేక మిమ్మల్ని మీరే మభ్యపెట్టుకుంటున్నారా? నన్ను మోసంచేస్తున్నారా?"

"చెప్పు శోభా, తక్షణం చెప్పెయ్యి, ఎవరో?"

"ఎవరోకాదు మీ ఇల్లాలు."

"ఆఁ, ఆఁ . . నీకెలా తెలిసింది.?"

"అవును. నాకెలా తెలుస్తుందని ఊరుకున్నారు. ఎప్పుడైనా మీకు భార్య ఉందని ఒక్కమాట చెప్పలేదు! నాకే తెలిసింది నేడు . . . ఏమండీ . . . నేనూ ఒక స్త్రీనే. నావంటి స్త్రీ ఘోరంగా బాధపడుతూఉంటే ఎలా సహించను? నాకు హృదయం లేదనుకున్నారా? జీవంలేని ఆటవస్తువుననుకున్నారా?"

"కాదు శోభా కాదు. నీ హృదయం నవనీత సమానం . . . నాకు భార్య ఉన్నది నిజమే కాని ఆమెను ఎప్పుడు బాధించలేదు, దూషించలేదు. ఆమె కే కొరతా లేకుండా చూచాను. ఇల్లు వదిలి నీ దగ్గరికి వచ్చేముందు ఆమెకు ఏమాత్రం ధనాభావం లేకుండా ఏర్పాటు చేసి వచ్చాను."

"అంతేనా? . . . అయ్యో, భర్తప్రేమ లేనిదే సిరిసంపదలను చూచుకొని ఏభార్య ఆనందంగా ఉండ గలదు? ప్రేమకుబదులు డబ్బా? అదేనా ప్రేమ విలువ? భార్యకు భర్తే సర్వస్వం కాదా! భర్త ఉండీ లేనట్లు జీవించడం దుర్భరం! ఆమెను ఈ విధంగా మోసపుచ్చడం ధర్మమా? ఆమె ఎంత బాధపడుతూ ఉందో ఒక్కక్షణం మీరు గ్రహిస్తే మీ గుండె నీరైపోవద్దా?"

"శోభా, నీవు చెప్పిందంతా సత్యమే! అయితే ఒక ముఖ్యవిషయం . . . ఎందుకో నేను ఆమెను ప్రేమించలేదు. ప్రేమించలేకపోయాను."

"మరి ఎందుకు వివాహం చేసుకున్నారు?"

"తల్లిదండ్రులు చేసిన వివాహానికి నేనెలా బాధ్యుణ్ణి? నేను చేసింది ఒక్కటే తప్పు, ధైర్యం చాలక నీతో చెప్పంది."

"ఇంత గుణవంతులైఉండీ ఇంత అన్యాయానికి ఎలా ఒడిగట్టగలిగానారండి?"

"అదికాదు శోభా, అంధకారమయంగా ఉన్న నా జీవితం ఎంత శూన్యంగా ఉందో నీకు తెలియదు! అప్పుడు శోభా, నీవు ఒక జ్యోతివలె నా జీవితంలో ప్రవేశించి కాంతిమయం చేశావు! నిన్ను ప్రేమించి నట్లు నేనొక స్త్రీని ప్రేమించగలనని కలలో అనుకోలేదు."

"నిజంగా నన్ను ప్రేమించారా?"

"సందేహమా?"

"అయితే ప్రేమించిన దాన్ని సంతోషపెట్టడానికి సిద్ధంగా ఉన్నారా? నా మనశ్శాంతికోసరం నేను కోరినట్లు చేస్తారా? సంకోచిస్తున్నారా?"



"లేదు శోభా లేదు. ఏమి కోరుతున్నావో చెప్పు."

"మీరు మీ భార్యతో కలిసి కాపరం చేస్తుంటేనే నాకు సంతోషం! నా మనస్సుకు శాంతి! అదొక్కటే నా కోర్కె! మీ రిద్దరూ భార్యాభర్తలుగా ఆనందంగా ఉన్నది చూచినప్పుడే నా జన్మ ధన్యమవుతుంది."

చంద్రా ఉలిక్కిపడ్డాడు. ఏమీ తోచలేదు. ఇటువంటి కోరిక కోరుతుందని అనుకోలేదు.

"శోభా, శోభా, ఎందుకిలా నన్ను పరీక్షిస్తున్నావు?"

"అయ్యయ్యో, ఇంతేనా? తీర్చరా నా కోరిక! ఎంత పాపం చేశాను! ఇంత గృహచ్ఛిద్రం నా వల్లనేకదా? నా కోసరం నా పాప పరిహారం కోసరం నా ఆత్మశాంతి కోసరం ఇంత మాత్రం చెయ్యలేరా?. . . నా దేహం, నా సౌందర్యం, నా హృదయం, నా నాట్యం సర్వం మీకు అర్పించానే. . . మీ మాట చెల్లించరా?" అని ఏడవసాగింది.

"వద్దు శోభా, వద్దు. నీ కన్నీరు నన్ను దహించి వేస్తూ ఉంది. నీ కోసరం, నీ ప్రేమకోసరం నీవు కోరినట్లే చేస్తాను."

శోభ అమాంతంగా చంద్రా పాదాలమీదపడి, "నిజంగా? ఎంత గొప్పవారండీ మీరు! ఇప్పుడు నా భారమంతా మాయమై తేలికగా ఉంది! . . . ఈ రోజు ఎటువంటి సుభదినం! . . ." అన్నది.

"అయితే ఒకటి. ఆమెను ప్రేమించలేను. నా ప్రేమ సంపూర్ణంగా నీ కర్పించేశాను. నా దగ్గిర మిగులు అవంతైనా లేదు."

"నా మీద ప్రేమకు మీ భార్యమీద అనురాగానికి విరోధంలేదు."

"శోభా, నా శోభా" అని లేవనెత్తి తన రొమ్ముకు హత్తుకొన్నాడు. శోభ చంద్రాలో లీనమై పోయింది!

* * * *

ఆ రాత్రి చంద్రా గాఢంగా నిద్రించేవరకు శోభ నిద్ర పోతున్నట్లు కళ్ళు మూసుకొని తరవాత లేచి కూర్చుని తీవ్రంగా యోచించింది. ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? తానున్నంతవరకు చంద్రాకు భార్య మీద మనసు పోదు. తనతోటి ప్రేమబంధం తెంపుకోలేడు! చంద్రాను వదిలి దూరంగా వెళ్ళిపోవడ మొక్కటే మార్గం. ఆ భావం రాగానే హృదయంలో తుపాను రేగింది. చంద్రాను వదిలి వెళ్లిపోవడం సాధ్యమా? . . . ఝంఝూనిలం ఉరవడికి తాళలేక నడిసముద్రంలో మునుగుతూ తేలుతూ ఉన్న నావవలె మనస్సు అస్థిరంగా స్వాధీనం తప్పింది. వచ్చే ఏడ్పు మింగి నిస్ప్రహకు లోబడి పోయింది. తను నోచుకొన్న వ్రతఫలం ఇంతే కాబోలు! ఇతరుల సొమ్ము అపహరించి లభించే సంపద శాశ్వతంగా నిలుస్తుందా? తాను చంద్రా ప్రేమను అపహరించిందా? లేదే! చంద్రాప్రేమ తనదే! తన స్వంతధనం. ఆ ధనాన్ని ఇంకొకరికి దానం చెయ్యలేను. నేను చంద్రాను వదలను, వదలలేను. అయ్యయ్యో, ఏమిది? స్వార్థానికి లోబడిపోతూ ఉన్నానే ... లేదు లేదు. తనకు త్యాగంలోనే ముక్తి. తనకు మిగిలిందొక్కటే—విరక్తి. తన ఆత్మ వికాసానికి మార్గం— భక్తి. తనకిప్పుడు అవశ్యమైనది వియోగాన్ని సహించే శక్తి.

ఉషఃకాంతి తూర్పుదిక్కున వ్యాపించేవేళకు శోభ మనస్సు నిశ్చలమైంది. హృదయం నిర్మలమైంది. "తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ. ఓం శాంతిః శాంతిః శాంతిః" అని లోలోపల స్మరించింది.

చంద్రా లేచి కాలకృత్యాలు ముగించి కాఫీ పుచ్చుకొని బైటికి వెళ్ళాడు. తక్షణమే శోభ తనకు తెలిసిన ప్లీడరు దగ్గిరికి వెళ్లి తన ఆస్తిపాస్తుల విషయం ఏర్పాట్లు చెయ్యడానికి కావలిసిన దస్తావేజు తయారు చెయ్యమని చెప్పి వచ్చింది. తనకున్న రొక్కంలో సగం అనాథశరణాలయాలకు, మిగిలిన యావత్తు తన భవనం, నగలూ చంద్రాకు చెందేటట్లు, మిగిలిన రొక్కం తన పేరులో బాంకీలో ఉంచి, వడ్డీ ప్రతినెల తాను తెలియజేసే విలాసానికి పంపేటట్లు వ్రాయించింది.

ఆ నాటి సాయంత్రం రాత్రి చీకటి సమీపించే సమయంలో శోభ "ఇక వెళ్లరూ కమల మీ కోసరం కాచుకుంటుంది" అని నెమ్మదిగా అన్నది. చంద్రా చకితుడై శోభ చేతులు పట్టుకొని దీనంగా చూస్తూ పలకలేదు. శోభ వచ్చే దుఃఖాన్ని బిగబట్టుకొని "నా కిచ్చిన మాట మరిచిపోయారా?" అని మందలించింది.

చంద్రా మాట్లాడకుండా వెళ్లిపోయాడు. శోభ పూజామందిరానికి వెళ్లి వెంకటేశ్వరుని పటంముందు నిలబడి నిమీలితనేత్ర అయి ధ్యాననిమగ్న అయిపోయింది.

దస్తావేజు తయారైన వెనక ఒకరోజు సాయంత్రం యథాప్రకారం చంద్రా ఇంటికి వెళ్లేటప్పుడు శోభ "ఏమండీ, రేపు మీరు వచ్చేటప్పుడు తప్పక కమలను పిలుచుకొని రండి..." అని కోరింది.

మరునాడు శోభ ప్రయాణసన్నాహంలోఉండి పోయింది. ఒక పెట్టెలో నిరాడంబరమైన చీరలు, తనకు కావలిసిన కొన్ని వస్తువులు, చంద్రా వ్రాసిన గీతాలసంపుటి పెట్టుకొని సిద్ధమైంది. సాయంత్రం అయిదు గంటలకు చంద్రా కమలతో వచ్చాడు. ఇద్దరినీ చూచి శోభ ఆనందంతో పొంగిపోయింది.

"వచ్చారా? ఆలుమగలు. రండి. కూర్చోండి. నాకిది మరపురాని శుభదినం. అక్కయ్యకు బావయ్యకు స్వాగతం!" అని నమస్కరించింది.

కమల "చెల్లీ" అంటూ శోభను కౌగలించుకుంది. "అక్కయ్యా" అంటూ శోభ ఆమె పాదాలు స్పృశించింది. ఈ దృశ్యం చూస్తున్న చంద్రా కన్నీరు ఆపలేకపోయాడు.

శోభ "ఏమండీ, కన్నీరా? వద్దు! వద్దు! మన జీవితాల్లో దుఃఖానికిక చోటులేదు" అంది.

ఇంతలో చంద్రాదృష్టి పెట్టెమీద పడింది. "ప్రయాణమా?" అన్నాడు.

శోభ—అవును.

చంద్రా—ఎక్కడికింత ఆకస్మికంగా?

శోభ—ఎక్కడికో, కానీ ఆకస్మికంగా కాదు. నేను వెళ్లేముందు సావధానంగా నా చరిత్ర వినమని నా ప్రార్థన.

ఆమె చెప్పసాగింది.

"మా అమ్మ ప్రఖ్యాత నర్తకి. పేరు వినిఉంటా రేమో! జయలక్ష్మి. పండనల్లూరు మీనాక్షి సుందరం పిళ్లెవద్ద మూడేండ్లు నృత్యం నేర్చుకుంది. అప్పుడ







మొటిమలు
మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి శాస్త్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, కాంతిగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, మరుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

భరతనాట్యం శాస్త్రోక్తంగా శిక్ష పొందినవారు ఎక్కువ లేరు. అందువేత మాఅమ్మకీర్తిదేశమంతటా వ్యాపించింది. వేలకువేలు గడించింది. జమీందార్లు, ధనవంతులైన వ్యాపారులు, ఉన్నత ప్రభుత్వోద్యోగులు, కవులు, పండితులు ఆమె పాదదాసులయ్యారు. కొంతకాలం తరవాత ఆమెకు దురభ్యాసాలు అలవడ్డాయి. క్రమేణా కళాప్రావీణ్యం తగ్గజొచ్చింది. గడించిన ధనం సన్నగిల్లి పూర్తిగా అదృశ్యమైంది. నమ్మినవారు మోసంచేశారు.

"మా అమ్మకు నేను, మా అక్క జ్యోత్స్న ఇద్దరే కూతుళ్లు. అక్కయ్యను తనకు మించిన నర్తకిగా తయారు చెయ్యాలనే అభిలాష. తాను కొంతవరకు నేర్పింది. కాని శిక్షణ పూర్తికాకపూర్వమే అమ్మ మమ్మల్ని వదిలి వెళ్లిపోయింది. మేము దిక్కుమాలిన వాళ్లమైపోయినాము. నేను చిన్నదాన్ని. నా భారమంతా మా అక్కయ్యమీద పడింది. కేవలం నృత్యం చేసి ధనం ఆర్జించడం కష్టమైంది. రసికులకు తన కళ సర్పించడానికి బదులు కామాంధులకు దేహాన్ని అర్పించి బ్రతకవలసి వచ్చింది. మా అక్కయ్యకు ఒకటే లక్ష్యం, నన్ను గొప్ప నర్తకిని చెయ్యవలెనని. దాని కోసరం ఎంతైనా వెచ్చించడానికి వెనకతియ్యలేదు. తాను మొదట కొంత నేర్పి తరవాత గొప్ప గురువుల వద్దకి పంపింది. మా అమ్మమీది గౌరవంవల్ల వాళ్లు ఎక్కువ డబ్బు ఆపేక్షించలేదు. నాకు పదిహేనేళ్లప్పుడు అరంగేట్రం జరిగింది జయప్రదంగా. పత్రికల్లో నా కౌశలాన్ని అమితంగా పొగిడి వ్రాశారు. రసికులుమెచ్చుకున్నారు. అప్పుడప్పుడు ప్రదర్శనాలు ఇయ్యసాగాను. సొని సంసారం గడపడానికి మా అక్కయ్య తన దేహాన్ని బలి ఇచ్చింది. ఆమెకు కాన్సర్‌రోగం ప్రారంభమైంది. బాధ బలహీనత ఇన్నిటికి లక్ష్యం చెయ్యలేదు. నా అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేసింది. ఆఖరుకు ఒక రోజు నరకయాతన అనుభవించి కండ్లు మూసుకుంది. ఆ నాడు నన్ను దగ్గిరికి తీసుకుని పలికిన ఉపదేశవాక్యాలివి 'చెల్లీ, ఏడుస్తున్నావా. వద్దమ్మా! నా ఆఖరుమాటలు విను. ఎంత దరిద్రమైనా అనుభవించు, కాని నీ దేహాన్ని మలినం చెయ్యవద్దు. నా తుచ్ఛజీవితసరణిని అనుసరించ వద్దు. నీ వొక గొప్ప నర్తకివి కాగలవు! కళను త్యజించి కామానికి లొంగిపోవద్దు. భగవంతునిమీద తప్ప మానవమాత్రులమీద ప్రేమను కోరవద్దు. చెల్లీ, ఇదే నా ప్రార్థన . . . ప్రమాణం చెయ్యి.'

"ఒంటరిదాన్ని అయిపోయాను. సంతతమూ నాట్యాభ్యాసంతో నా దుఃఖాన్ని కప్పుకున్నాను. ప్రతి ప్రదర్శనమూ ఒకటికన్న వేరొకటి నా ప్రతిభను లోకానికి విదితం చేశాయి. పేరుతోపాటు సంపద పెరిగింది. నా సౌందర్యాన్ని అనుభవించడానికి అనేకులు ప్రయత్నించారుగాని వారి యత్నాలు ఫలించలేదు. నాకు పురుషులంటేనే విసుగు జనించింది. అటువంటి నాన్ని మిమ్మల్ని కలుసుకొన్న క్షణంనించి మారిపోయాను. నా హృదయాన్ని నాకు తెలియకనే మీా కర్పించాను. మిమ్మల్ని నా భర్తగా, నా దైవంగా ప్రతిష్ఠచేసి పూజించుకొన్నాను. మిగతా కథ మీాకు తెలిసిందే. నాకు దాచిఉంచిన రహస్యం బైటపడినప్పటినించి నేను పడిన బాధ, నా అంతఃకరణలో సంఘర్షణ చెప్పలేను. తుదకు ఒక్క తీర్మానానికి వచ్చాను. నా చిత్తాన్ని నిశ్చలం చేసుకున్నాను. మీారు కరుణించి నన్ను కృతార్థురాల్ని చేశారు. ఈ నాటికి నా జన్మ తరించింది."

కమల ఏడుస్తూనే ఉంది. చంద్రా ఆవేదనతో "శోభా, శోభా, నీ జీవితం ఇంత విషాదమయమైందని నాకు తెలియదు. శోభా, తెలియదు" అన్నాడు.

"ఒక్క క్షణం" అని శోభ లోపలికి వెళ్లి ఒక వెండిపళ్లెంలో పుష్పాలు పళ్ళు దస్తావేజు ఉంచి తీసుకొని వచ్చింది.

"నా అక్కయ్యకు, బావయ్యకు నా ప్రేమకానుక. ప్రీతితో మీారు స్వీకరించాలి." అని చంద్రాకు అందచేసింది. చంద్రాకు ఏమీా అర్థం కాలేదు.

"ఏమిటే దస్తావేజు?" అని అడిగాడు.

"నాకు తులలేని ఆనందంఇచ్చి, తుదకు ముక్తిమార్గం చూపించిన మీాకు కృతజ్ఞతాచిహ్నంగా నేను అర్పించుకొన్న నైవేద్యం. ఈ భవనం అంతా మీాదే నేటినించి. ఇక్కడే మీారు సంతోషంగా కాపరం చేస్తే అంతేచాలును. . . నేనిక వెళతాను నన్ను మరిచిపొండి. . ."

"శోభా, శోభా, నీ నిర్ణయం మార్చుకోలేవా? నీవు వెళ్లిపోతే నా జీవితం ఏమైపోతుందో ఆలోచించావా వద్దు శోభా వద్దు. . ."

కమల ఏడుస్తూ శోభ చెయ్యి పట్టుకొని "చెల్లీ, వెళ్లకు· వారి హృదయంలో నీ కున్న స్థానం నేనాక్రమించుకోలేను. నీ పక్కన నాకూ కొంతచోటు ఉంటే నాకు చాలును" అంది.

"నీ మంచితనంవల్ల అంటున్నావు అక్కా. అన్నీ చర్చించుకునే ఈ నిర్ణయానికి వచ్చాను. నే నిక్కడే ఉన్నంతవరకు మీా దాంపత్యం నిరంతరాయంగా అభివృద్ధి పొందదు. మీారెంత మాత్రం చింతించ వద్దు."

"శోభా, నవనీతంవంటి నీ హృదయం ఇలా పాషాణం చేసుకోగలిగావెలా? నా మీాద ప్రేమంతా ఎలా చంపేసుకోగలిగావు?"

"ఎంత మాటన్నారు? మీా మీాద నా ప్రేమకు జరామరణాలు లేవు. ఇకమీాద అది నిష్కళంకమైన దివ్యప్రేమగా ఉంటుంది. అంతే. . . నేను వెళ్లక తప్పదు· చక్కని రాజమార్గం ఇది. నన్ను వారించకండి."

"ఇంత పట్టుదలతో ఉంటే నేనేమి చెయ్యను? ఒక్క మనవి. ఎప్పుడైనా నీ మనసు మారి నన్ను కలుసుకోవలెననే కాంక్ష కలిగితే ఆ క్షణమే సంకోచం లేకుండా రా. నా హృదయద్వారం నీ కోసరం ఎప్పుడూ తెరిచే ఉంచాను. నన్ను మరిచిపోవద్దు."

అని చంద్రా ఆమెను దగ్గిర చేర్చుకొని ముంగురులు సవరించి ఫాలభాగాన్ని ముద్దుపెట్టుకున్నాడు.

శోభ చంద్రా పాదాలు తాకి చేతులు కళ్లకద్దుకొని నమస్కరించి, కమల చేతులు పట్టుకొని "సంతోషంగా ఉండు" అని తన పెట్టె తీసుకొని ఆపుకోడానికి ప్రయత్నించినా ఆగని కన్నీరు చెక్కిళ్లమీాద ప్రవహిస్తూ ఉన్నా లెక్కచెయ్యక "సెలవు, సెలవు" అని భవనం వదిలి వెళ్లిపోయింది. ★

అనన్య సామాన్య
ప్రచారంగల
తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

